


(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

## -33-

(03‘ మార్చ్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

‘**మధ్యతరగతి మందహాసాలు**‘ అని డాక్టర్ నారాయణరెడ్డి ఒక పుస్తకం వ్రాసారు. ఈ శీర్షిక నాకెంతో క్రొత్తగా కనిపించింది. ఈనాటి పరిస్థితులు గురించి ఆలోచిస్తున్నప్పుడు మధ్యతరగతికి చెందిన శీర్షికలెన్నో జ్ఞాపకం వస్తాయి.

అన్నటికంటె మధ్య తరగతి మనోగతాలు అనే శీర్షిక స్వీకరించి ఏదైనా వ్రాస్తే బాగుండుననిపించింది. ఈ మనోగతాలు ఎల్లకాలం వుంటాయి. ఎన్నో వుంటాయి. వీటిలో వింతా, జాలి, వేదనా విడ్డూర్యం, హాస్యం, నైరాశ్యం మొదలైన భావనలెన్నో ద్యోతకమవుతూ వుంటాయి.

రాజకీయ సాంఘిక ఆర్థిక వాతావరణాలు మారినప్పుడల్లా పైన చెప్పిన భావనలు క్రొత్త రంగులు లభ్యమవుతూ వుంటాయి. కొన్నాళ్ళకు అవి వెలిసిపోవడం మళ్ళీ క్రొత్తవి రావడం జరుగుతుంది.

మా ఇంటి సమీపంలో ఒక కుటుంబం వుంది. పెద్ద తలకాయలో ఆరు, చిన్నవో నాలుగూ వున్నాయి. ఎక్కడికి బయలుదేరినా అంతా బయలుదేరవలసిందే అది ఆయనగారికి సరదా. పదిమందీ ఏదో పేరంటానికో, పెళ్ళికో బయలుదేరినట్లు వెడతారు. ఒక్కొక్కప్పుడు పాలకికూడా దశజీవులూ తరలిపోవలసిందే

ఇంటికి ఏ చుట్టం వచ్చినా సరే, ఒక గంటవుండి బయలుదేరినాసరే వెంట వెళ్ళి రైలెక్కించి రావలసిందే ‘అదేమిటండీ అంతమందీ వెడతారు‘ అంటే

‘అందులో ఒక మర్యాద లేదుటండీ. పైగా ఎంత నిండుతనంగా వుంటుందలా సాగనంపి చేతులు విసిరివస్తే‘ అనేవాడు.

మొన్న నేను రోడ్డుమీద వెడుతుంటే పనిమాలా పిలిచి ''ఏమండోయ్ యిక బంధువుల్ని రైలెక్కించి, చేతులు విసిరి రావడమనేది స్వస్తి. ప్లాటుఫాం టిక్కెట్టు మనిషికి పావలా చేశారు. ఎంత పెద్దమనిషి వచ్చి బయలుదేరి వెడుతున్నా గుమ్మలోనే గుడ్ బై. మనిషికి పావలా.. అయిదు పైసలు అయిదు పైసలు చొప్పున ఎక్కిపోతున్నాయి రేట్లు. తేలు కుడితే ఎక్కినట్లు.

దీనికి మంత్రం ఎవడేస్తాడు. మనమే వేసుకోవాలి. దానిపేరు మొండి మంత్రం. మధ్యతరగతి వాళ్ళ సంగతి మరీ అదోగతిలో పడుతోందండి. ఉన్నవాళ్ళమే ఆకాశంలో వున్న నక్షత్రాలు ఎన్ని రాలితే మాత్రం ఏం వెలితి? అట్లాగే వాళ్ళ సిరి కూడా.

ఫ్లాటుఫారం టిక్కెట్టు పావలా చేశారు. స్వరాజ్యం వచ్చిన తర్వాత కాసేపు కులాసాగా తిరిగిరండి అందరికీ ఫ్రీ పాస్ ఇస్తారనుకున్నాం. ఏం సౌకర్యాలు.

ఫ్లాట్‌పారం టిక్కెట్టు పావలా, ఇంకో పావలా ఇంకో పావలా ఇస్తే ఇంటికొచ్చి క్రాపింగ్ చేస్తాడు. పంట్లాం ఇస్త్రీ చేస్తాడు. ఇంకో పావలా పెడితే కుంచె చీపురొస్తుంది. అదీ పావలా కొచ్చేది ముప్పావులా అయిందనుకోండి. కాకపోతే దానితో మనకు బోలెడు పనివుంది.

లేకపోతే ఎక్కడ బూజు అక్కడేగా మరి. నిజానికి ఇది బూజు యుగం. ఎక్కడ పడితే అక్కడే బూజు. రాజకీయాల్లో బూజు, సంఘంలో బూజు, సంసారాల్లో బూజు, సదాచారాలు బూజు, సనాతన ధర్మాలకు బూజు, సభ్యతకు బూజు, సంస్కృతికి బూజు. ఇంట్లో బూజు, మనస్సులో బూజు.

ఇన్ని బూజులు దులుపుకోవలసిన అవసరం వచ్చింది. కనిపించని బూజుల మాట అలావుంచి కంటికి కనిపించే బూజన్నా దులుపుకోవద్దూ. అందువల్ల ఫ్లాట్‌పారం 'టాటా' ల కన్నా కుంచె చీపురు ఎంతో అవసరం. ఏమంటారు?'' అన్నాడాయన.

తెలియకుండా అయిదుగుర్ని తర్వాత పశ్చాత్తాపం చెందుతూ ఇంకో ముగ్గుర్ని కని అవస్థలు పడుతున్న ఓ బీద గృహస్థు మొన్న అన్నాడు...''ప్రతి వస్తువు ధరా అయిదు పైసలు, పది పైసలు చొప్పున పెంచుకుపోతుంటే వస్తువుల్ని, సుఖాల్ని వదులుకోవడం ఎలాగండీ? ఇంత పోతారెండి. అయిదు పైసలకేనా? పోనీ వాళ్ళనే బాగుపడని అని చెల్లించి వెయ్యడం బాగా అలవాటైపోయింది.

అసలు పైసలంటే లెక్కలేకుండా పోయింది. మొన్న ఇరవై పైసలకు రిక్షా మాట్లాడుకుని ఇంటికి వచ్చాను. చిల్లరలేక పావలా చేతికిచ్చాను. అతగాడు ''అయిదు పైసలేగా'' అంటూ వెళ్ళిపోతున్నాడు.

''అదేమిటయ్యా మాట్లాడింది ఇరవైపైసలేగా'' అన్నాను.

''చిల్లర లేదయ్యా ఏం చెయ్యమంటావు?'' అని అతగాడు రిక్షా ఎక్కాడు.

''పోనీ నే మారుస్తా ఇలాతే పావలా'' అని వెంటపడ్డాను.

దానికి అతగాడు ''అయిదు పైసలకే అలా గోల చేస్తావేమయ్యా. అంతగా అంగలార్చేవాడివి రిక్షా ఎందుకెక్కావు? కళ్ళనీళ్ళు పెట్టుకోకు. రేపు కనపడితే ఇచ్చేస్తాలే. ఇప్పుడు నా బేరం పోతుంది'' అని రివ్వున చక్కాపొయ్యాడు.

''కూరగాయల బేరానికి వెళ్ళినప్పుడు ఏ మూడు పైసలో మనకివ్వాల్సి వస్తే ''ఆ మొగ్గ వేశాలేవయ్యా. నే తూస్తూంటే నువ్వక్కడెక్కడో చూస్తావాయె. దిమ్మడి లెక్కడున్నాయి ఇవ్వడానికి'' అని ఉడాయిస్తాడు. కొందరు దుకాణదార్లు ఒక ముదర పింద గిరాటు వేసి ''వదిలిపెట్టవయ్యా బాబూ నీ వంటి వాళ్ళకోసమే గవర్నమెంటు యింకా నయాపైసలు తయారుచేస్తూంది. నయాపైసాను వనర్చు క్రింద చూచుకుంటాడు తండ్రి'' అని నవ్వులాట పట్టిస్తాడు.

''ఎన్నని చెప్పుకుంటాం అవస్థలు. చెప్పుకుంటే సిగ్గు. మానుకుంటే పొడి దగ్గు. మొన్న బజారులో గులాబి పువ్వులు అమ్ముతుంటే వెళ్ళి అడిగాను. 'పది పైసలకు మూడు' అన్నాడు.

రెండు పువ్వులివ్వమన్నాను. ఆ దుకాణదారుడు పకపకా నవ్వి ''మూడు పువ్వులు తీసుకోవయ్యా మూడు పైసలు మిగిల్చి మేడ కడతావా?'' అన్నాడు.

ప్రక్క దుకాణం దారుడు అందుకుని 'లేదురా అయ్యగారు ఊరు బయట పెద్ద గుడి కట్టిస్తున్నాడురా. అంతా దమ్మిడీలతోనే. రాయికీ రాయికి మధ్య నయాపైసలు పరుస్తున్నారు' అని హేళన చేశాడు. అదంతా వినలేక పదిపైసలు పడేసి మూడుపువ్వులూ తీసుకుని పరుగెత్తుకు చక్కా వచ్చాను'' అన్నాడాయన.

అంతా మిథ్య. జగమంతా మిథ్య, బ్రతుకంతా మిథ్య అనే భావాలు మధ్య తరగతి వాళ్ళకే ఎక్కువగా కలుగుతున్నాయి. "సిరిగల జీవితాలు, వాహనాలూ.. బీదల జీవితాలు రిక్షాలు. మధ్య తరగతి వాళ్ళ బ్రతుకులు రోడ్డు రోలర్లు అందులో ఎడ్లను కట్టి లాగించేవి" అన్నాడొకాయన. నిజమేమరి వీళ్ళపని ఆ ఎడ్లకన్నా కష్టంగా వుంది. నడిచి తీరాలి. లేకపోతే కమ్చీ కర్ర దెబ్బలు. ఏం చేస్తారు.

"ఎప్పటికన్నా ఈ ధరలు తగ్గి మళ్ళీ మంచికాలం వస్తుందేమో" అని ఒకాయన ఆశ వెలిబుచ్చాడు మొన్న బందరు బస్సులో. ప్రక్కనున్న ఆయన పకపకా నవ్వి 'మీకింకా ధరలు తగ్గుతాయనే ఆశ వుందేమిటి? ఈజిప్టులో పిరమిడ్లు వున్నాయి. ఎప్పటికైనా అవి కుదించుకుని, కొంత ఎత్తు తగ్గించుకుంటాయేమోగానీ మన ధరలు మాత్రం తగ్గవు మహారాజా. కొబ్బరికాయ రూపాయన్నర అమ్మే రోజులు కొద్దిలో రాబోతున్నాయి. మిర్చి కుచ్చీల లెక్కలో అమ్మవలసి వస్తుందంటున్నారు వ్యాపారులు. ధరలు తగ్గడమేమిటండీ. ఎంత ఎత్తు పెరుగుతాయో చూద్దాం అనాలిగాని" అన్నాడు.

మధ్యతరగతి మంతనాలు ఎంతో విచిత్రంగా వుంటాయి. అందులో చాలావరకు అరణ్యారోదనాలే?

Post your comments